సాక్షి జగిత్యాల

గురువారం : 4 : ఏప్రిల్ : 2024



వెల్గటూర్‌లో మట్టి దందా

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో గుట్టుగా సాగుతున్న మట్టి దందా వెలుగుచూసింది. మంగళవారం అర్ధరాత్రి మట్టి తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. - 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు(సా॥)	సహర్ శుక్ర(ఉ॥)
కరీంనగర్	6.28	4.38
పెద్దపల్లి	6.35	4.45
రాజన్న సిరిసిల్ల	6.35	4.46
జగిత్యాల	6.35	4.45

గరిష్టం/కనిష్టం
42.0/28.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలి



పోలీస్ కళాబృందంతో న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: సామాజిక అంశాలపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం కలిగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా పోలీస్ కళాబృందం నీలిమను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పోక్సో యాక్ట్‌తోపాటు వివిధ చట్టాలు, గంజాయి నివారణకు కళా ప్రదర్శనలు ఇవ్వాలని సూచించారు. మూఢనమ్మకాలపై చైతన్యం చేయాలన్నారు. ఆడపిల్లలను చదివించేలా, బాల్య వివాహాలు జరగకుండా ప్రయత్నించాలని తెలిపారు.

మొదటి ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: ఈవీఎం, వీవీప్యాట్‌ల మొదటి ర్యాండమైజేషన్ పూర్తయిందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిదులు, అధికారులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈవీఎం, వీవీప్యాట్లను కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించామని, కోరుట్లకు 327 బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, జగిత్యాలకు 317, ధర్మపురికి 336 చొప్పున కేటాయించామని తెలిపారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాలకు పంపిస్తామన్నారు. పూర్తి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులు, సహాయ ఎన్నికల అధికారులకు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, ఆర్డీవో మధుసూదన్ పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలను అప్రమత్తం చేయండి



మాట్లాడుతున్న వసంత

జగిత్యాలజోన్: వేసవిలో ప్రజలను అప్రమత్తం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అధికారులకు సూచించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల నుంచి జూన్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ.. ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. జెడ్పీ సీఈవో రఘువరణ్, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి రాముని తలంబ్రాలు

కోరుట్ల: భద్రాచలంలో నిర్వహించే శ్రీరాముడి కల్యాణ తలంబ్రాలను ఇంటివద్దకే చేర్చే అవకాశాన్ని టీఎస్ ఆర్టీసీ కల్పిస్తోందని సంస్థ కరీంనగర్ రీజియన్ కార్గో ఏటీఎం సదాశివ్ తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా స్వామివారి తలంబ్రాలను భక్తుల ఇంటివద్దకే చేర్చేందుకు ఆర్టీసీ నిర్ణయించిందని, తలంబ్రాలు కావాలనుకునే భక్తులు కోరుట్ల ఆర్టీసి డిపో లాజిస్టిక్ కేంద్రంలో రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కోరుట్ల డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేశ్‌ను సెల్ నంబర్ 91542 98572, ఆర్టీసీ కార్గో కార్యాలయం నంబర్ 99591 05928లో సంప్రదించాలని సూచించారు.

దోమల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న శ్రీధర్

జగిత్యాల: దోమలతో డెంగీ, మలేరియా, మెదడువాపు, చికున్‌గున్యా, బోదకాలు వస్తాయని, ఈ క్రమంలో వాటిని నివారించాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక ఐఎంఏ హాల్‌లో కీటక జనిత వ్యాధులపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. జ్వరాలు, మలేరియా, పైలేరియా డెంగీ అనేకం బాధపెడతాయని, ఇవి రాకుండా ఉండాలంటే దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు. దోమలు చాలా ప్రమాదకరమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ బృందం వెంకటేశ్, నాగయ్య, శ్రీనివాస్, డాక్టర్ సమియోద్దీన్, జైపాల్ పాల్గొన్నారు.

చల్లగా తాగిస్తున్నారు

- ప్రమాదకరంగా మారుతున్న ఐస్
- జిల్లాలో విచ్చలవిడిగా వినియోగం
- అనారోగ్యం బారినపడుతున్న ప్రజలు



జిల్లాకేంద్రంలో తయారవుతున్న ఐస్



జిల్లాకేంద్రంలో ఐస్ వినియోగిస్తున్న ఓ జ్యూస్ సెంటర్ (ఫైల్)

జగిత్యాల: ఎండలు మండిపోతున్నాయి. మార్చి రెండోవారం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. జగిత్యాల జిల్లాకేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం గ్రామీణులు అధికంగా వస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను కలిసేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. బయటకు వస్తే ఏదో ఒక చల్లని శీతల పానీయం తాగాలని అనిపించడం సర్వసాధారణం. రోడ్డుపై కనిపించే చెరుకురసాలు, పండ్లరసాలు, జ్యూస్‌లు, కూల్‌డ్రింక్స్ ఆశ్రయిస్తుంటారు. జిల్లాకేంద్రంలో ఇప్పటికే అత్యధికంగా వెలిశాయి. ప్రజలు చల్లగా ఉన్నాయని వాటిని సేవిస్తే అనారోగ్యాలు వస్తుంటాయి.

ఐస్ ముక్కలతో పరేషాన్

చెరుకు రసాలు, జ్యూస్‌లో ఐస్ ముక్కలు వేసి తయారు చేసి ఇస్తుంటారు. మండుటెండల్లో దాహానికి తాళలేక ప్రజలు సైతం ఆ శీతల పానీయాల సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఆ ఐస్ తాగితే ఎంత ప్రమాదకరమో చెప్పని పరిస్థితి ఉంటుంది. ముఖ్యంగా ఐస్‌ను పండ్ల జ్యూస్‌లు, చెరుకు రసాలలో తప్పనిసరిగా వేస్తారు. మండే ఎండల్లో ఈ జ్యూస్‌లు తాగితే చాలా వరకు ఉపశమనం కలుగుతుంది. అదే సమయంలో ఆరోగ్యానికి ప్రమాదకరంగాను మారుతుందని వైద్య నిపుణులు అంటున్నారు.

కొబ్బరినీరు తాగడమే మేలు



ఎండ వేడిమికి ఉపశమనం కోసం కొబ్బరినీరు తాగడమే మేలు. ఐస్ ఉన్న పళ్ల రసాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ఒకవేళ తీసుకుంటే ఐస్ లేకుండా తీసుకోవాలి. వీటివల్ల అతిసారం, పేగు సంబంధిత వ్యాధులు, గొంతునొప్పి వంటివ్యాధులు వస్తాయి. జాగ్రత్తగా ఉండాలి.

– ఒడ్నాల రజిత, గైనకాలజిస్ట్

ఐస్‌లో రెండురకాలు

ఐస్‌ను రెండు విధాలుగా తయారుచేస్తుంటారు. ఒకటి పారిశ్రామిక అవసరాలకు వినియోగించేది కాగా.. మరొకటి మాంసం, చేపలు, పండ్లు, ఔషధాల నిలువలు, ఆస్పత్రులు కోసం వినియోగిస్తుంటారు. ఐస్‌ను ఎలాంటి నీటితోనైనా తయారు చేయొచ్చు. పండ్లరసాలకు వినియోగించే ఐస్‌ను మాత్రం పరిశుభ్రమైన నీటితో.. పరిశుభ్రమైన వాతావరణంలోనే తయారు చేయాలి. అది స్వచ్ఛంగా ఉంటుంది. కానీ.. అలాంటి ఐస్‌ను ఎవరూ కొనుగోలు చేయడం లేదని, అపరిశుభ్రంగా తయారు చేసిన, బయట ప్రాంతంలో దొరికే ఐస్‌నే శీతలపానీయాల్లో వాడుతున్నట్లు సమాచారం. ఇవి ఎంతో హానికరం. నాణ్యతలేని ఐస్‌ముక్కలను వాడటం వల్ల గొంతునొప్పి, జ్వరం, అస్తమా వంటివ్యాధులు వస్తుంటాయి. ముఖ్యంగా శీతల పానియాలు తాగువారు ఐస్‌ముక్కలు వేసుకోకుంటేనే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. నాణ్యతలేని ఐస్‌ను గుర్తించడం కష్టమే అయినప్పటికీ ఏ ఐస్ వేస్తారో తెలియదు. అయినప్పటికీ ఐస్ వేసుకోకపోవడమే చాలా మంచిది.

మహిళల భద్రతకు ‘భరోసా’

- ఒకేచోట తక్షణ సేవలు
- న్యాయ సహాయంతోపాటు వైద్యం
- బాసటగా నిలుస్తున్న భరోసా కేంద్రం



ధరూర్ క్యాంప్‌లోని భరోసా కేంద్రం

జగిత్యాలక్రైం: మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. దీంతోపాటు మహిళల్లో ధైర్యం కల్పించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో భరోసా సెంటర్‌ను ఏర్పాటు చేసి ఒకేచోట న్యాయ సహాయం, వైద్యం, సైకోథెరపీ అందేలా చూస్తోంది.

మహిళలకు రక్షణగా..

మహిళలకు రక్షణగా.. చిన్నారులపై లైంగిక వేధింపులు, చిత్రహింసల కేసులు ఇటీవల పెరిగిపోతున్నాయి. లైంగికదాడి కేసులు జిల్లాలో రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి కేసుల్లో తక్షణ సాయం కోసం ‘భరోసా’ కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి 6న పోలీసుశాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. నిరాధరణకు గురైన పిల్లలు, మహిళలకు ఈ కేంద్రంలో తక్షణ వైద్యం, న్యాయ సహాయంతోపాటు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. కేంద్రంలో వసతి నిపుణులు అండగా ఉండి నిందితులకు శిక్ష పడేలా చూడనున్నారు. బాధిత పిల్లలకు కొత్త జీవితం ప్రసాదించేలా చర్యలు తీసుకుంటారు. 14 ఏళ్లలోపు పిల్లలు లైంగికదాడులు, వేధింపులకు గురైన వారు, మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయగానే కేసు నమోదు చేసి తక్షణ సాయం కోసం భరోసా కేంద్రానికి పంపుతారు. కేంద్రంలో ముందుగా ఏఎన్‌ఎం వైద్య సాయం అందిస్తారు. పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. భరోసా కేంద్రం జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తుంది. సీసీఎస్ సీఐ, హెడ్ కానిస్టేబుల్, మహిళా పోలీసు, ఏఎన్‌ఎం, బాధితులకు సాయంగా ఉండేందుకు మరో మహిళ, లీగల్ అడ్వయిజర్ ఉంటారు. జిల్లాకేంద్రంలోని ధరూర్ క్యాంపులోని జిల్లా ఎస్పీ కార్యాలయం పక్కనే ప్రైవేట్ భవనంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాధితులకు కేంద్రంలో వసతి కల్పించి అన్నిరకాలా అండగా నిలుస్తున్నారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు, యువతులు తక్షణ సాయం కోసం 100కు డయల్ చేయటం, లేదా సమీప స్టేషన్‌కు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు.

జిల్లాలో నమోదైన అత్యాచార కేసులు	
2021 :	49
2022 :	36
2023 :	42
2024లోఇప్పటివరకు	9

మహిళలకు భరోసా



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మహిళల కోసం భరోసా కేంద్రాన్ని ప్రారంభించాం. జిల్లాలో అత్యాచార, నిరాదరణకు గురైన 14 ఏళ్లలోపు ఆడపిల్లలు, మహిళలకు తక్షణ సాయం అందిస్తాం. ఈ కేంద్రంలో వైద్య, న్యాయ సాయంతోపాటు నిందితులకు శిక్ష పడేలా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటారు. బాధితులకు ధైర్యాన్ని నింపేలా కౌన్సెలింగ్ నిర్వహిస్తాం.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

విత్తన డీలర్లకు అవగాహన



రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

మేడిపల్లి: ప్రభుత్వ నిబంధనలను విత్తన డీలర్లు, ప్యాక్స్ సీఈవోలు నడుచుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. స్థానిక రైతు వేదికలో భీమారం, మేడిపల్లి మండలాల విత్తన డీలర్లు, ప్యాక్స్ సీఈఓలకు అవగాహన కల్పించారు. ఎరువులను ఈపాస్ విధానంతో రైతులకు అందించాలన్నారు. వ్యవసాయ భూమిలేని వారికి ఎరువులు ఇవ్వొద్దని సూచించారు. అనంతరం ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మేడిపల్లి, వల్లంపల్లి, భీమారంలోని గోదాములను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో త్రివేదిక, అధికారులు వంశీ, సురేంద్ర నాయక్, మహమ్మద్ అఖిల్, నగేశ్, రాము, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, మధు, రాకేశ్, రాజేంద్ర పాల్గొన్నారు.

వెంకట్రావుపేట రైతు వేదిక పరిశీలన

అనంతరం గతేడాది జూలైలో కురిసిన వర్షాలకు ధ్వంసమైన వెంకట్రావుపేట రైతు వేదికను అధికారులు పరిశీలించారు. నష్టం విలువ రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు.

కిక్ బాక్సింగ్‌లో వ్యవసాయ విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకేంద్రంలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీల్లో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చి బంగారు పతకాలు గెలుచుకున్నారు. వీరు వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. పతకాలు సాధించిన వైష్ణవి, అక్షిత, సందీప్, రిషబ్‌దేవ్, వెండి పతకాలు సాధించిన శ్రీరూప, శ్రీజ, విశాల్‌ను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతి నారయణ్ భట్, బాక్సింగ్ కోచ్ రామాంజనేయులు, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జి మహేశ్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ అభినందించారు.

‘ఉపాధి’లో కూలీల సంఖ్య పెంచాలి



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న సంపత్‌రావు

రాయికల్: వేసవిలో ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని, కూలీలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సంపత్‌రావు సూచించారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్, వీరాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలన్నారు. వడదెబ్బ తగలకుండా కూలీలకు తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఏపీవో దివ్య పాల్గొన్నారు.

పరీక్ష ఒక్కటే.. నియామకంలో వ్యత్యాసం



సమ్మెలో జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

- మొదటి విడత విధుల్లో చేరిన వారిని పంచాయతీ కార్యదర్శులుగా
- రెండో విడత చేరినవారిని ఔట్‌సోర్సింగ్‌గా గుర్తింపు
- రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూపు

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి పనుల్లో కీలకపాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను గత ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేయడంతో వారిలో సంతోషం వ్యక్తమైంది. అయితే నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేసి.. అదే ఉద్యోగ పరీక్ష రాసి.. మరో విడత ఎంపిక చేసిన పంచాయతీ కార్యదర్శులను మాత్రం ఓపీఎస్ (ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శి)గా పరిగణించారు. వారిని రెగ్యులరైజేషన్ చేయకపోగా.. తక్కువ వేతనంతో పని చేయించుకుంటున్నారని వారు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 380 గ్రామపంచాయతీలు

జిల్లాలో 20 మండలాలుండగా.. 380 గ్రామపంచాయతీలున్నాయి. ప్రతి గ్రామపంచాయతీకి ఒక్కో పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. జిల్లాలో ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 27 మంది ఉన్నారు. మిగతా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. మూడేళ్ల ప్రొబేషనరీ కాలానికి జేపీఎస్‌లు విధుల్లో చేరారు. 2021లో అమలు చేసిన పీఆర్సీ సమయానికి జేపీఎస్‌ల సర్వీస్ రెండేళ్లు పూర్తయింది. తమకు పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం ప్రొబేషనరీ కాలాన్ని మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పొడిగించి రూ.15 వేల వేతనాన్ని రూ.28,719కి పెంచింది. తర్వాత రెగ్యులరైజేషన్ చేశారు. ఓపీఎస్‌లకు మాత్రం రూ.10,600 వేతనం చెల్లిస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్యదర్శుల్లో ఉత్కంఠ

జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఓపీఎస్‌ల రెగ్యులరైజేషన్ కాకపోవడంతో వారిలో ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఓపీఎస్‌లు 27 మంది ఉన్నారు. ప్రొబేషనరీ కాలాన్ని పట్టించుకోకుండా ఓపీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేస్తేనే న్యాయం జరుగుతుందని అంటున్నారు.

రెగ్యులరైజేషన్ చేయాలి



తక్కువ వేతనం అయినప్పటికీ గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్నాం. పల్లెలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చి పనిచేస్తున్న వారందరినీ రెగ్యులరైజేషన్ చేయాలి. అప్పుడే ఏళ్లుగా పనిచేసిన వారికి న్యాయం జరుగుతుంది.

– సతీశ్‌కుమార్, ఓపీఎస్‌ల సంఘం ప్రతినిధి

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులతోపాటు ఓపీఎస్‌లు పనిచేస్తున్నారు. ఓపీఎస్‌లను రెగ్యులరైజేషన్ చేయడం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉంటుంది. జిల్లాలో 27 మంది ఓపీఎస్‌లు ఉన్నారు. నిబంధనల ప్రకారం వారికి వేతనాలు చెల్లిస్తున్నాం.

– దేవరాజ్, డీపీఓ

గల్ఫ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం

- జగిత్యాలలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా..
- బీడీ టేకేదార్ల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: తనను ఎంపీగా గెలిపిస్తే బీడీ కార్మికులు, వారి కుటుంబాల కోసం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి, గల్ఫ్ కార్మికులకు గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయిస్తానని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన బీడీ టేకేదార్లు, కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. బీడీ కార్మికులకు పీఎఫ్‌తో సంబంధం లేకుండా పెన్షన్ అందిస్తామన్నారు. బీడీ పరిశ్రమను కాపాడుకోవడంతోపాటు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, బీడీ టేకేదార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు గిరి నాగభూషణం, కొత్త మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రంగాపూర్ ప్రాజెక్ట్ గేట్ లాక్‌లు ధ్వంసం



వృథాగా పోతున్న నీరు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని రంగాపూర్ ప్రాజెక్ట్ గేట్ లాక్‌లను బుధవారం వేకువ జామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో నీరంతా వృథా అవుతోంది. స్థానికుల సమాచారంతో రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది వచ్చి లాక్‌లను మూసే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. గడ్డి కట్టలతో గేట్ మూసే ప్రయత్నం చేసినా కిందకు దిగటానికి వీలులేక నీటి ప్రవాహం ఆగట్లేదు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, వారి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని సహాయకులు తెలిపారు.

పసుపు వ్యాపారుల సిండికేట్

మెట్‌పల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో పసుపు వ్యాపారుల సిండికేట్‌ను అరికట్టాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పసుపు కొనుగోళ్ల తీరును వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ క్వింటాల్ పసుపునకు రూ.18వేల పైగా చెల్లిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ రైతులకు మాత్రం రూ.12వేలకు మించి వ్యాపారులు ఇవ్వడం లేదన్నారు. సిండికేట్‌గా మారి రైతులను మోసం చేస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పసుపునకు క్వింటాల్‌కు రూ.15వేల మద్దతు ధర చెల్లించాలన్నారు. చెరుకు ఉత్పతిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కోరుట్ల:బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ముస్లింలకు పట్టణంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. నిజామాబాద్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలోనే ముస్లింలకు మేలు జరిగిందన్నారు. ఏఐఎంఐఎం పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ సాబీర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నిజామాబాద్‌ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి

కోరుట్ల: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు పట్టణంలో బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు కాంగ్రెస్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కౌన్సిలర్ నబీ, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు గంగాధర్, రాజం, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు

- 22 ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన వైనం
- జైనాలో 43.4 డిగ్రీలు నమోదు



జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరాయి. 22 ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీలుగా నమోదైంది. ధర్మపురి మండలం జైనాలో 43.4 డిగ్రీలుగా నమోదైంది. గోధూర్‌లో 42.7, కొల్వాయిలో 42.4, పెగడపల్లిలో 41.9, రాయికల్, అల్లీపూర్, తిర్మలాపూర్, కోరుట్లలో 41.7, నేరేళ్ల 41.4, మల్లాపూర్, గులకోటలో 41.3, సారంగాపూర్‌లో 41.2, అయిలాపూర్, మెట్‌పల్లి, పొలాస, రాఘవపేట, కథలాపూర్‌లో 41, సిరికొండలో 40.9, వెల్గటూర్‌లో 40.8, మేడిపల్లిలో 40.6, గొల్లపల్లిలో 40.5, మద్దుట్లలో 40.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

క్లుప్తంగా

అమ్మాయిది శ్రీలంక.. అబ్బాయిది పందికుంటపల్లి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి ప్రభాకర్

రామడుగు(చొప్పదండి): అమ్మాయిది శ్రీలంక.. అబ్బాయిది రామడుగు మండలంలోని పందికుంటపల్లి. దేశాలు వేరైనప్పటికీ ప్రేమ అనే బంధం ఇరువురినీ ఒక్కటి చేసింది. పందికుంటపల్లికి చెందిన కట్కం సురేందర్ ఉద్యోగం చేయడానికి లండన్ వెళ్లాడు. తాను పని చేస్తున్న ఆఫీస్‌లో శ్రీలంక దేశానికి చెందిన జానుషికతో పరిచయం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారడంతో తమ కుటుంబసభ్యులను పెళ్లికి ఒప్పించారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏడడుగులు వేశారు. వివాహానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

భూ కబ్జాపై ఎస్పీకి ఫిర్యాదు

సిరిసిల్లక్రైం: అధికారి పార్టీ అండ చూసుకొని మాజీ సర్పంచ్ తన భూమి కబ్జా చేశాడని ఓ వ్యక్తి బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన మెండె గంగయ్యకు అతను ఇల్లు కట్టుకున్న ఏరియాలో 16 గుంటల భూమి ఉంది. మంగళవారం ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జలపతి ఆ భూమిలోకి చొరబడి, గంగయ్యను కొట్టి, చంపుతానని బెదిరించి, తెల్ల కాగితంపై సంతకం తీసుకున్నాడు. అధికార పార్టీ నాయకుడినని, ఎమ్మెల్యే పేరు చెప్పి, భూమి ఆక్రమించాడని, తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు బాధితుడు తెలిపాడు.

శ్రీజ అత్తింటివారి అరెస్టు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ పంచాయతీ పరిధి విజయ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీజ, ఆమె కుమారుడు రేయాన్ష్, తల్లి జయప్రద ఆత్మహత్య కేసులో శ్రీజ అత్తింటివారిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆమె తండ్రి గద్దె వెంకటేశ్వరాచారి ఫిర్యాదు మేరకు శ్రీజ భర్త నరేశ్, అత్తామామ సుజాత–కేశవాచారిలపై కేసు నమోదు చేశామన్నారు. బుధవారం వారిని అరెస్టు చేసి, జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

గంజాయి మాయంపై కొనసాగుతున్న విచారణ

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ పోలీసులు సీజ్ చేసిన గంజాయి పోలీస్‌స్టేషన్ నుంచి మాయమైన ఘటనపై విచారణ కొనసాగుతోంది. గతంలో గంజాయి తరలింపులో నిందితులుగా ఉన్నవారిని, కొత్తగా అనుమానిస్తున్న వారిని మూడోరోజు బుధవారం విచారించారు. 70 కిలోల గంజాయి ప్యాక్ చేసిన సంచులను ఠాణా నుంచి ఏదైనా వాహనంలో తరలించి ఉంటారని భావిస్తున్నారు. దీనిపై పలు కోణాల్లో విచారణ జరుగుతున్నట్లు తెలిసింది.

ఆవుకు రెండు దూడలు



ధర్మపురి: ధర్మపురివాసి భారతపు సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఆవు బుధవారం ప్రసవ వేదనతో అల్లాడిపోయింది. పశు వైద్యాధికారి రాజేందర్‌రెడ్డికి సమాచారం ఇవ్వడంతో వచ్చి, సహజ ప్రసవం చేశారు. ఆ ఆవు రెండు దూడలకు జన్మనివ్వడంతో రైతు సంతోషం వ్యక్తం చేశాడు. పశువులు కవలలకు జన్మనివ్వడం చాలా అరుదని, మూడు జీవాలూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైదాధికారి తెలిపారు.

వెల్గటూర్‌లో మట్టి దందా

- రెవెన్యూ అధికారులు, పోలీసుల జాయింట్ ఆపరేషన్‌తో వెలుగులోకి..
- టిప్పర్, లారీలు, జేసీబీ వదిలేసి, పారిపోయిన డ్రైవర్లు
- రూ.కోట్ల స్కాంపై చర్యలు తీసుకోవాలి : విప్, ఎమ్మెల్యే అడ్లూరి



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గంలో గుట్టుగా సాగుతున్న మట్టి దందా వెలుగుచూసింది. వెల్గటూర్ మండలంలోని కిషన్‌రావుపేట శివారులో నిల్వ ఉంచిన చెరువు మట్టిని లారీల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు, రెవెన్యూ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, పట్టుకున్నారు. వారి వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 11 గంటలకు జేసీబీ సహాయంతో మట్టిని లారీల్లో నింపి, పెద్దపల్లి జిల్లా గొౌరెడ్డిపేటకు తరలించే ప్రయత్నం చేస్తుండగా రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడి చేశారు. అప్పటికే మట్టి నింపిన టిప్పర్ సహా 11 లారీలు, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు వాహనాలను వదిలేసి, అప్పటికే పారిపోయారు. రెవెన్యూ అధికారులు ఆ వాహనాలను బుధవారం ఎస్సై ఉమాసాగర్‌కు అప్పగించగా వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నల్ల మట్టిని తన స్థలంలో నిల్వ ఉంచినందుకు పట్టాదారు తిరుపతి, మట్టిని అక్రమంగా నిల్వ ఉంచినందుకు రవీందర్, తరలించేందుకు ప్రయత్నించిన వెంకటేశ్వర్‌లపై తహసీల్దార్ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏడాది కిందే డంపుల ఏర్పాటు!

మట్టి డంపులను ఏడాది కిందటే ఏర్పాటు చేసినట్లు సమాచారం. కప్పారావుపేట చెరువు నుంచి మట్టి తీయడానికి 2022లో 3 రోజులకు అనుమతి తీసుకొని, రెండుచోట్ల డంపు చేశారు. కప్పారావుపేట శివారులో ప్రైవేటు వ్యక్తి పట్టా భూమిలో సుమారు ఎకరం విస్తీర్ణంలో 8 ఫీట్ల ఎత్తులో, కిషన్‌రావుపేట శివారులోని కొలకాని రాములు, తిరుపతి, రవిలకు చెందిన సర్వే నంబర్ 348/ఇ/1లో 1.24 ఎకరాల్లో 3 ఫీట్ల ఎత్తులో మట్టి నిల్వ చేశారు. మూడు రోజులుగా మట్టిని తరలిస్తుండగా స్థానికులు కొందరు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే, మట్టి తరలించేవారు వారినే బెదిరించారని, పోలీసులు, రెవెన్యూ అధికారులకు తాము లంచాలిచ్చేశామని బదులిచ్చినట్లు సమాచారం. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ దందా వెలుగుచూసింది.

పదేళ్లుగా అక్రమాలు..



ధర్మపురి నియోజకవర్గంలో పదేళ్లుగా కొందరు నల్లమట్టి, కంకర, గ్రానైట్ తదితర వ్యాపారాల్లో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా అనుమతులుంటే వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, పాత అనుమతులతో ఇప్పుడు అక్రమంగా వ్యాపారం చేస్తామంటే కుదరదు. రూ.కోట్ల స్కాం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. ఈ విషయమై విజిలెన్స్, రెవెన్యూ, మైనింగ్ ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తా. – విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్

దుబాయిలో విలాసాగర్‌వాసి మృతి

- రెండు రోజుల క్రితం గుండెపోటు
- పన్నెండేళ్లుగా అక్కడే..
- కూతుళ్ల పెళ్లికీ రాలే..
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు



శ్రీనివాస్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బతుకుదెరువు కోసం పన్నెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు.. కూతుళ్ల పెళ్లికీ రాలేదు.. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో మృతిచెందాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బోయినపల్లి మండలంలోని విలాసాగర్‌కు చెందిన చల్ల శ్రీనివాస్(58) గ్రామంలో హమాలీ పని చేసేవాడు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో దుబాయి వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి స్వగ్రామానికి తిరిగి రాలేదు. కోవిడ్, వీసా సమస్యల వల్ల తన ఇద్దరు కూతుళ్ల రవళి, రమ్య వివాహానికి సైతం రాలేకపోయాడు. మృతుడికి భార్య పద్మ ఉంది. ఆమె అప్పులు చేసి, కూతుళ్ల వివాహం జరిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందాడన్న విషయం దుబాయిలో ఉండే అతని బంధువు ద్వారా తెలిసిందని పేర్కొన్నారు.

విప్‌ను కలిసిన మృతుడి కుటుంబసభ్యులు

శ్రీనివాస్ మృతితో తాము దిక్కులేనివారమయ్యామని బాధిత కుటుంబసభ్యులు కంటతడి పెట్టారు. తమకు ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందించి, ఆదుకోవాలని బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామం రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి..



శ్రీహర్ష (ఫైల్)

పెద్దపల్లిరూరల్: విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని కమాన్ రోడ్డు (పాత చిత్రాణి టాకీసు వద్ద) ప్రాంతానికి చెందిన కీర్తి శ్రీహర్ష(14) బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లి, ఇంటికి వచ్చాడు. బకెట్‌లో ఉన్న వాటర్ హీటర్‌కు విద్యుత్ సరఫరా ఉండటాన్ని గుర్తించకుండా పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కాసేపటికి గుర్తించిన తండ్రి రవికుమార్ కర్ర సాయంతో హీటర్‌ను తొలగించి, శ్రీహర్షను ఆస్పత్రికి తరలించాడు. కానీ, అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటిదాకా అందరితో కలివిడిగా ఉన్న శ్రీహర్ష మృతిచెందాడని తెలుసుకున్న కాలనీవాసులు కంటతడి పెట్టారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

- ఇరాక్‌లో గతేడాది డిసెంబర్ 29న రోడ్డు ప్రమాదంలో మృతి



వెంకటేశం మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన వలసజీవి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మూడు నెలల తర్వాత ఆయన మృతదేహం స్వగ్రామం చేరింది. బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన బైరి వెంకటేశం(40) ఉపాధి నిమిత్తం 14 ఏళ్లుగా ఇరాక్ వెళ్తున్నాడు. గతేడాది డిసెంబర్ 29న అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామం చేరగా కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య సౌమ్య, కూతురు జాను, తల్లి బుచ్చవ్వ ఉన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగం, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ గల్ఫ్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి వెంకటేశం కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కుమారుడి చెంతకు తప్పిపోయిన వృద్ధుడు



వృద్ధుడిని అప్పగిస్తున్న డే కేర్ సెంటర్ నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తప్పిపోయిన ఓ వృద్ధుడు బుధవారం తన కుమారుడి చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లంతకుంట మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన మెడకొక్కుల నర్సయ్య మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వచ్చి, తప్పిపోయాడు. స్థానిక బస్టాండ్ ప్రాంతవాసులు డే కేర్ సెంటర్ నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి, ఆయనను తీసుకెళ్లారు. కేంద్రం ఇన్‌చార్జి మమత నర్సయ్యకు భోజనం పెట్టించి, వివరాలు తెలుసుకోగా ఓబులాపూర్‌వాసినని చెప్పాడు. దీంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్‌కు ఫోన్ చేయగా నర్సయ్య కుమారుడిని పంపించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు వృద్ధుడిని అతని కొడుకుకు అప్పగించారు. డే కేర్ నిర్వాహకులకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



బాధితురాలిని కాల్వలో నుంచి బయటకు తీసుకువస్తున్న బ్లూకోల్ట్స్ పోలీసులు

మల్యాల(చొప్పదండి): ఆత్మహత్య చేసుకునేందుకు వరద కాల్వలో దిగిన ఓ వివాహితను బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. మేడిపల్లి మండలంలోని కొండాపూర్‌కు చెందిన బొల్లె లక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. బుధవారం మల్యాల మండల కేంద్రంలోని తన తల్లిగారి ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, బయలుదేరింది. మల్యాల అడ్డ రోడ్డు సమీపంలోని వరద కాల్వ వద్దకు చేరుకొని, అందులో దిగింది. గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు వెంటనే వచ్చి, ఆమెను బయటకు తీసుకువచ్చారు. కాల్వలో నీరు తక్కువగా ఉండటంతో లక్ష్మి ప్రాణాలతో బయటపడింది.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

కోనరావుపేట(వేములవాడ): భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.30 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన కంటె నరేశ్‌కు చందుర్తి మండలం అనంతపల్లికి చెందిన ఎక్కల రేవతి అలియాస్ శిరీషతో 2017లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.10లక్షల కట్నంతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. వారికి ఒక కూతురు జన్మించింది. తర్వాత కొన్నాళ్లకు నరేశ్‌తోపాటు తల్లిదండ్రులు, ఆడపడుచు అదనపు కట్నం కోసం వేధించగా 2021 మార్చి 19న రేవతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో బుధవారం జిల్లా జడ్జి ప్రేమలత నరేశ్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రైలు కింద దూకి యువకుడి బలవన్మరణం

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కింద దూకి గుర్తు తెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. బుధవారం జమ్మికుంట రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ యువకుడు(30) రైలు కింద దూకాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లేవు. తెలుపు చుక్కలున్న బ్లూ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి, గడ్డంతో ఉన్నాడు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ సూచించారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

కోనరావుపేట(వేములవాడ): బైండోవర్ ఉల్లంఘించిన ఓ వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన అలిపిరి ఆదిరెడ్డి గతంలో తన ట్రాక్టర్ ద్వారా కనగర్తి మూలవాగు నుంచి పలుమార్లు ఇసుక అక్రమ రవాణా చేస్తూ అధికారులకు చిక్కాడు. తహసీల్దార్ ఎదుట రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేశారు. మళ్లీ ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో బైండోవర్ నిబంధన ఉల్లంఘించాడని జరిమానా విధించగా బుధవారం చెల్లించాడు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తల్లీపిల్లల అదృశ్యం

జమ్మికుంట(హుజూరాబాద్): తన భార్యాపిల్లలు కనిపించడం లేదని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని సోమారంపేటకు చెందిన సూర రాజు బతుకుదెరువు కోసం తన భార్య కవిత, ఇద్దరు పిల్లలతో కలిసి జమ్మికుంట పట్టణంలోని మారుతీనగర్‌కు వచ్చాడు. స్థానికంగా ఓ ఇల్లు అద్దెకు తీసుకొని, ఉంటున్నాడు. ఈ నెల 1వ తేదీన అతను కూలీ పనికి వెళ్లి, ఇంటికి రాగా భార్యాపిల్లలు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. పక్కింట్లో ఉంటున్న గుంజి నాగరాజు తీసుకెళ్లినట్లు తనకు అనుమానం ఉందని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోరుట్ల రూరల్: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ శివారు ఎస్సారెస్పీ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దాపూర్ గ్రామస్తులు బుధవారం కాల్వ వెంట వెళ్తుండగా అందులో మృతదేహం కనిపించింది. వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని, బయటకు తీయించారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు దుస్తులు ధరించాడని, ఇతర ఏ ఆధారాలు లభించలేదని ఎస్సై పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు కోరుట్ల సీఐ నంబర్ 87126 56820 లేదా ఎస్సై నంబర్ 87126 56790కు ఫోన్ చేయాలని కోరారు.

‘ట్రినిటీ’ విద్యార్థులకు ఓవరాల్ చాంపియన్‌షిప్



కరీంనగర్‌రూరల్: వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సూయి జనసిస్ ప్రోగ్రాంలో ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. 14 రకాల ఈవెంట్లలో సత్తా చాటడంతోపాటు యాక్టివ్ పార్టిసిపేషన్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి బుధవారం అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, ఎంబీఏ హెచ్‌వోడో ప్రవీణ్‌కుమార్, లెక్చరర్లు సంతోషి, రజితరెడ్డి, ఇలియాజ్ అలీ, అజారుద్దీన్, సుప్రియ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం
- భర్తే హత్య చేశాడని బంధువుల ఆందోళన
- డీఎస్పీ జోక్యంతో సద్దుమణిగిన వివాదం



సుధారాణి మృతదేహం

జగిత్యాలక్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఆమెను భర్తే హత్య చేశాడని పేర్కొంటూ బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాళ్ల సుధారాణి, గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఎల్లంకి రంజిత్ నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి హర్షవర్ధన్ (3) కుమారుడు సంతానం. భార్యాభర్తలు కొన్నాళ్లుగా జగిత్యాలలోని చిలుకవాడలో నివాసముంటున్నారు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 4న హర్షవర్ధన్ పుట్టువెంట్రుకలు తీసేందుకు నిర్ణయించారు. సంప్రదాయం ప్రకారం మేనమామ రావాల్సి ఉండగా.. రంజిత్ నిరాకరించాడు. దీంతో మరో సారి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సుధారాణి బుధవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించేలోపే మృతిచెందింది. విషయం తెలుసుకున్న సుధారాణి కుటుంబ సభ్యులు, బంధువులు జగిత్యాలకు చేరుకుని సుధారాణి భర్త రంజిత్, అతని కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించారు. డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ వేణుగోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. తన కూతురును రంజిత్ కులం పేరుతో దూషించి మానసికంగా వేధించాడని, చివరకు హత్య చేశాడని మృతురాలి తల్లి కాళ్ల వసంత ఆరోపించింది. ఆమె ఫిర్యాదు మేరకు రంజిత్‌తోపాటు, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 12 మందికి తీవ్ర అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు
- కరీంనగర్ జిల్లా వెదిర గ్రామంలో ఘటన



బాధితులను 108 వాహనంలో తరలిస్తున్న అధికారులు

రామడుగు(చొప్పదండి): కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిర గ్రామంలో ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడిచేశాయి. 12మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం గ్రామ పరిధిలోని మసుకుంట వైపువెళ్లే దారిలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడికి దిగడంతో పరుగులు తీశారు. గ్రామానికి చెందిన మచ్చ మల్లేశం, మీసాల సంజీవ్, నిట్టు కవిత, మీసాల రాజమల్లు, గుడిసె మల్లయ్య, కొలిపాక సంపూర్ణ, లక్ష్మి, అమృత, పుల్ల మల్లవ్వ, ముత్త కనకయ్య, కుమ్మరి రమ్య, ఉపేంద్ర పైన తేనెటీగలు పెద్ద మొత్తంలో దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మచ్చ మల్లేశం, మీసాల సంజీవ్, మీసాల రాజమల్లు, గుడిసె మల్లయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బాధితులను రామడుగు తహసీల్దార్ భాస్కర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు



అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి: చైన్ స్నాచింగ్ ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వివరాలను ఆయన వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన అక్కల అంతమ్మ మార్చి 29న స్థానిక పెట్రోల్ బంక్ వద్ద దోసకాయలు విక్రయించేందుకు జాతీయ రహదారి పక్కన కూర్చుంది. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు దోసకాయలు బేరం చేశారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపిస్తామని నమ్మించి, మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వివిధ మండలాలకు చెందిన ఎస్సైలు ఐదు రోజులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. బుధవారం రాయపట్నం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు గొలుసు, పుస్తె లభ్యమయ్యాయి. విచారణలో అయిలాపూర్‌కు చెందిన సిలిగిరి సందీప్, కోరుట్లకు చెందిన ముంజ రాజేందర్ చోరీ చేసినట్లు, మెట్‌పెల్లి మండలంలోని ఆరెపేటకు చెందిన అక్షయ్‌కుమార్, అతని భార్య అలేఖ్యలతో కలిసి వాటిని మంచిర్యాలలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు తేలింది.

జల్సాలకు అలవాటుపడే..

జల్సాల అలవాటుతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. గొలుసు చోరీ చేసిన మరుసటి రోజే విక్రయించడానికి బీంగల్ మండలానికి వెళ్లగా ఎవరూ కొనలేదన్నారు. దీంతో వారు మంచిర్యాలలో అమ్మేందుకు వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. బంగారు గొలుసుతో పాటు ఒక గ్రాము పుస్తె, 3 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులను త్వరగా పట్టుకున్న సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, సతీశ్, శ్రీధర్‌రెడ్డి తదితరులను ఎస్పీ అభినందించారు.

నకిలీ వీసాలతో మోసగించిన కేరళవాసి..



హసిఫ్ అరెస్టు చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): దుబాయ్‌లో ఉద్యోగాల పేరిట నకిలీ వీసాలు ఇచ్చి, మోసం చేసిన కేసులో కేరళకు చెందిన మహమ్మద్ హసిఫ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి తెలిపారు. వారి కథనం ప్రకారం.. హసిఫ్ గత జనవరిలో మెట్‌పల్లికి చెందిన ఏలేటి రమేశ్‌తో కలిసి ఈ ప్రాంతంలోని పలు వురికి దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి రూ.26,500 చొప్పున వసూలు చేశాడు. అనంతరం వీసాలు ఇవ్వగా వారు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అక్కడి అధికారులు పరిశీలించి, అవి నకిలీవని తేల్చారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. పోలీసులు గత ఫిబ్రవరిలో రమేశ్‌ను అరెస్ట్ చేశారు. బుధవారం హసిఫ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి..



అరెస్టు చూపుతున్న సీఐ సురేశ్‌బాబు

కోరుట్ల రూరల్: పట్టణంలోని హాజీపురకు చెందిన మహమ్మద్ షబ్బీర్‌ను గంజాయి తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు సీఐ సురేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణ శివారులోని వెటర్నరీ విశ్వవిద్యాలయం వద్ద ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో షబ్బీర్ బైక్‌పై నిజామాబాద్ నుంచి కోరుట్లకు గంజాయి తీసుకువస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 210 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. షబ్బీర్ కోరుట్ల పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్నాడని తెలిపారు. ఎస్సైని, సిబ్బందిని అభినందించారు. సీఐ వెంట ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులున్నారు.